క్లుప్తంగా

దూర విద్యకు ఫీజు చెల్లించండి

అయిజ: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఈనెల 11లోపు ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫీజు చెల్లించాలని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని ఆన్‌లైన్ సెంటర్లు, మీసేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించవచ్చని సూచించారు. రశీదును అధ్యయన కేంద్రంలో అందజేయాలని కోరారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల నైపుణ్యాన్ని ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులకు సరైన సమయంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయ్యాలని, విద్యార్థులకు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణకు ఎంఈఓ సూచించారు.

బాల కార్మికులు లేకుండా చూడాలి



శాంతినగర్: గ్రామాల్లో బాలకార్మికులు లేకుండా చూడాలని జిల్లా బాలసంరక్షణ విభాగం ఓఆర్ లక్ష్మీదేవి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం వీసీపీసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు.

మండల అభివృద్ధికి చేయూత అందించండి

శాంతినగర్: వడ్డేపల్లి మండలానికి నిధులు మంజూరు చేసి మండల అభివృద్ధికి చేయూత అందించాలని జెడ్పీటీసీ రాజు కలెక్టర్ సంతోషను కోరారు. నూతనంగా జిల్లాకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి శాలువా బొకేతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికీ రాముడి అక్షతలు



కేటీదొడ్డి: ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షతలు చేరాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు అన్నారు. మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లోని అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను మంగళవారం కేటీదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలోని ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో శోభాయాత్రతో ఇంటింటికీ తిరుగుతూ అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ..



శాంతినగర్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను శాంతినగర్‌లోని మారుతీనగర్‌లో శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. మారుతీనగర్‌లోని రామాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కాలనీలో అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, మధ్యలో చదువు మానేసిన పిల్లలను పాఠశాలలకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని కత్తేపల్లి, తూంపల్లి గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు.

ఫాతిమా షేక్‌కు నివాళి

వనపర్తి టౌన్: భారతదేశ మొదటి ముస్లిం టీచర్‌గా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా ఫాతిమా షేక్ అందించిన సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా ఉన్నారు.

ఆరేళ్లు గడిచినా.. నత్తనడకనే

- పచ్చర్లలో సాగని సబ్‌స్టేషన్ నిర్మాణం
- మూడు గ్రామాల ప్రజల నిరీక్షణ



వృథాగా ఉన్న విద్యుత్ స్తంభాలు



పచ్చర్లలో నత్తనడకన సాగుతున్న 33/11కేవీ సబ్ స్టేషన్ పనులు

రాజోళి: మూడు గ్రామాలకు విద్యుత్‌ను అందించేందుకు నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ నిర్మాణం ఆరేళ్లుగా నత్తనడకనే కొనసాగుతోంది. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఆశలు వదులుకుంటున్నారు. మండలంలోని పచ్చర్లలో నిర్మిస్తున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ నిర్మిస్తే విద్యుత్ కష్టాలు తగ్గుతాయని, వ్యవసాయ పనులకు అడ్డంకులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుందని ఆశపడిన ప్రజలకు నిరాశే మిగులుతోంది.

పచ్చర్ల, తనగల, తుమ్మిళ్ల గ్రామాలకు మూడు ఫీడర్ల ద్వారా విద్యుత్ అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. దాని కోసం గ్రామస్తులు తీర్మానంతో స్థానికంగా ఉన్న సర్వే నెంబర్ 24 నుంచి ఎకరా భూమిని కేటాయించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి 2017 అక్టోబర్ 22న అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు భూమి పూజ చేశారు. గ్రామాలకు మూడు ఫీడర్ల ద్వారా కరెంట్ సరఫరా చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాని నేటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రాంభం నుంచే నత్తనడకన సాగుతున్నాయి. కొద్ది నెలలకు విద్యుత్ స్తంభాలు, మెటీరియల్ తీసుకొచ్చారు. మిషన్ భగీరథ పనుల వల్ల పనులు ముందుకు సాగడం లేదని సాకు చెప్పారు. ప్రతి ఏటా పనులు పూర్తయి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని ఆశించిన రైతులకు, ప్రజలకు ఏళ్ల తరబడి నిరాశే మిగులుతోంది.

సబ్‌స్టేషన్ కోసం ఎదురు చూస్తున్నాం..



పచ్చర్లలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేసి నాలుగేళ్లు గడిచింది. భూమిపూజ సమయంలో హర్షం వ్యక్తం చేశాం. కానీ ఇంత వరకు పనులు పూర్తి కాకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలి.

– నాగరాజు, పచ్చర్ల

పైఅధికారులకు తెలియజేస్తాం..

గతంలో ఉన్న అధికారుల పర్యవేక్షణలో సబ్ స్టేషన్ పనులు జరిగాయి. ప్రస్తుతం సబ్ స్టేషన్ ఆవశ్యకతను, రైతుల ప్రయోజనాలను, దానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సందీప్, విద్యుత్ ఏఈ, రాజోళి మండలం

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..



చాగదోణ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: పదో తరగతిలోని వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కృషి చేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం చాగదోణ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ విజయ్‌కుమార్ వినూత్నంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చాగదోణ, ఇందువాసి పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు అనేది చాలా ముఖ్యమని, పదో తరగతి చదువుకుంటున్న ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువుకుని ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష పత్రాల కిట్టును ఎంపీపీ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రుక్మతుల్లా, చంద్రశేఖర్, ఎంపీఎఫ్ కో ఆర్డినేటర్ సాయికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు,

శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్



అయిజ: సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణ చేపట్టేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ అన్నారు. ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నరేష్ కుమార్ బృందం మంగళవారం మండల కేంద్రం, మండలంలోని మేడికొండలో పోలీసులు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేష్ కుమార్ మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు భరోసా, ధైర్యం కల్పించడం లక్ష్యంగా పోలీస్ వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందన్నారు. పోలీసులకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కాంబ్లే వినాయక్ కాశీనాథ్, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్



వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ మేనేజర్ అశోక్ కుమార్

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి గ్రామంలో ఎస్‌బీఐ అయిజ బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ అన్నారు. రైతులకు ప్రతి సంవత్సరం కిసాన్ సమన్ నిధి ద్వారా రూ.6వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గొర్రెలకు వైద్య చికిత్స



శాంతినగర్: అనారోగ్యంగా ఉన్న గొర్రెలకు మంగళవారం వైద్య చికిత్స అందించారు. శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో మండలంలోని కొంకలకు వచ్చిన కేసీఆర్ గొర్రెల యూనిట్లను డాక్టర్ పరిశీలించారు. మండల్లోని అనారోగ్యంగా ఉన్న గొర్రెలకు వైద్య చికిత్సలు అందించారు. లివర్ టానిక్‌లు, ఆకలి మందులు, మినరల్స్, విటమిన్ మందులు జీవాల యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచండి



మానవపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మానవపాడు: ప్రైవేట్ ఆస్పత్రులకు గర్భిణులు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేసుకునేలా అవగాహన కల్పించాలని డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించి తగిన సేవలు అందించాలన్నారు. పుట్టిన ప్రతి శిశువుకి అన్ని రకాల టీకాలు సమయం ప్రకారం వేయాలన్నారు. టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి వారిని తెమడ పరీక్షలు చేయించి పాజిటివ్ వచ్చిన వారిని 6నెలలు మందులు వాడించాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. 61 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. 16మందికి బ్లడ్ శాంపిల్స్ సేకరించి గద్వాల్ ఆరోగ్య కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పీఎచ్‌ఎన్ హెలెన్ చంద్రన్న, సంధ్యారాణి, సోని, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సొంతభవనాలేవి?

- ఇబ్బందుల్లో గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని అధికారులు



మల్దకల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాటు వాటికి మౌలిక వసతులు కల్పించకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కేంద్రాలది కీలక పాత్ర, చిన్నారులకు గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాయాల లేమీతో సతమతమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గర్భిణులు, బాలింతలకు మంచి నీరు, మరుగుదొడ్లు వంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కొన్ని కేంద్రాలలో మరుగుదొడ్లు ఉన్నా అవి శిథిలావస్థకు చేరాయి.

మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 30 కేంద్రాలకు స్వంత భవనాలు ఉండగా, మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాలలో కొనసాగుతున్నాయి. వాటిలో 2,793మంది చిన్నారులు, 759 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి..



గ్రామంలో 6 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 2వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– సుస్మిత, మల్దకల్

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం ..



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనాలలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మరుగుదొడ్డి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– పుష్పలత, అంగన్‌వాడీ టీచరు, మల్దకల్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



అంగన్‌వాడీ కేంద్రాలలో నెల కొన్న సమస్యలు పరిశీలించి నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందజేస్తాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం.

– కమలాదేవి సీడీపీఓ

ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

గద్వాల అర్బన్: ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోని, వాటిని సాధించే దిశగా పట్టుదలతో చదవాలని డీసీపీఓ నర్సింహ, సీడీపీఓ హేమలత అన్నారు. మంగళవారం గద్వాల మండలంలోని కాకులారంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలలు సమస్యలు, వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100లేదా 1098కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు పావని, పంచాయతీ కార్యదర్శి బీసీ రెడ్డి, హెడ్మాస్టర్ సంజీవమణి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, ఉపాధ్యాయులు మాధవిలత, చిన్న నర్సింహులు ఉన్నారు.

సీఏ సాధించిన పేద విద్యార్థి



టీజీ ఆంజనేయులు

మానవపాడు: చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు రావని, పట్టుదల, సంకల్పం, కృషి ఉంటే ఎవరైనా ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఓ పేదింటి విద్యార్థి.. పేద కుటుంబంలో పుట్టినా చదువాలనే కోరిక, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పట్టువీడని విక్రమార్కుడిలా అనుకున్నది సాధించాడు. మండలంలోని కొర్విపాడుకు చెందిన టీజీ ఆంజనేయులు మంగళవారం విడుదల చేసిన సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఆయన తల్లిదండ్రులు టీజీ మారెన్న, రాములమ్మది కొర్విపాడులో పేద కుటుంబం. సీఏ రెండోసారి రాసి ఉత్తీర్ణత సాధించినట్లు ఆంజనేయులు తెలిపాడు. అలంపూర్‌లో 2013–14 పదో తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ నారాయణ జూనియర్ కళాశాల (డీఆర్‌డీఏ) హైదరాబాద్‌లో పూర్తి చేశారు. సెంట్రల్ అకాడమి ఇనిస్టిట్యూట్ విజయవాడలో చదువుతూ ఆన్‌లైన్ క్లాసెస్ (గూగుల్ డ్రైవ్) ద్వారా చదువుకున్నట్లు తెలిపాడు. సీఏలో ఆంజనేయులు ఉత్తీర్ణత సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్నేహితులు, సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

స్వచ్ఛత అవార్డుకు ఎంపికపై హర్షం



అలంపూర్ మున్సిపాలిటీ

అలంపూర్: స్వచ్ఛత అవార్డులో భాగంగా ఓడీఎఫ్ ప్లస్ మున్సిపాలిటీగా ఎంపిక కావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కమిషనర్ గోల్కొండ నర్సయ్యలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో ఫలితాల్లో ఓడీఎఫ్ ప్లస్‌గా స్థానం దక్కినట్లు తెలిపారు. 2018లో మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన అలంపూర్ మారిందని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేస్తుండటంతో మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని తెలిపారు. అందులో భాగంగానే 2020–21లో పట్టణ ప్రగతి అవార్డు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. 2021–22లో ఆస్తి పన్ను, రెవెన్యూ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కించుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో అవార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ఓడీఎఫ్ ఫలితాల్లో ఓడీఎఫ్ ప్లస్ ర్యాంక్ సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

రేపు ముగ్గుల పోటీలు



మాట్లాడుతున్న ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద

గద్వాల అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్మద తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ముగ్గుల పోటీలకు మహిళలు, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో రేవతి, జయమ్మ, మంజుల తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

గద్వాల అర్బన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మంగళవారం వీరాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో, మహిళా సాధికారత, లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, ప్రధాన మంత్రి మాతృ వందన, ప్రధాన మంత్రి సురక్ష, బీమా యోజన, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ జ్యోత్స్న, సభ్యులు సరోజ, చిట్టెమ్మ, వీరాపురం సర్పంచు స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, శాంతన్న, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ అధికారి శివ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై బాలల చట్టాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలకు ఎదురయ్యే వివిధ సమస్యలు, బడిబయటి పిల్లలు, బాల్య వివాహాల వల్లే కలిగే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల యొక్క చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలపై ఎలాంటి వేధింపులు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ కమిటీ సభ్యులకు ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏ సమయంలోనైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బలరాం, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, ఉన్నారు.

తెలుగు సాహిత్యంపై పట్టు అవసరం

అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 350 తెలుగు సాహిత్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్ జిల్లా సభ్యుడు శ్యాం తెలిపారు. డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా తెలుగు సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. కరుణాకర్, బాలస్వామి, పాల్గొన్నారు.